
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



సోమశిలలో 69.5 టీఎంసీలు

ఆత్మకూరు: జలాశయంలో శనివారానికి 69.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 6,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 1,800, ఉత్తరకాలువకు 600, దక్షిణకాలువకు 150, కండలేరుకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,860
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,150
3 శాతం జీఎస్టీతో	రూ.7,365
నవర (8 గ్రా)	రూ.58,920

గరిష్టం/కనిష్టం
25.2 /22.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉండి ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం గాలిలో తేమ 98 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో కంప్యూటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): పదో తరగతి చదివిన నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో 'డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్' కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 3 నెలల పాటు ఉంటుందని, అనంతరం వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం కళాశాలకు వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494456326, 9704510793 నంబర్లలో సంప్రదించాలన్నారు

92 శాతం పింఛన్ల పంపిణీ



పొట్టేపాళెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. శనివారం 92 శాతం మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. 3,09,000 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా 2,81,900 మందికి నగదు పంపిణీ చేశారు.

జైళ్ల శాఖలో బదిలీలు

నెల్లూరు (క్రైమ్): జైళ్ల శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కేంద్ర కారాగార అడిషనల్ సూపరింటెండెంట్ ఎ.మహేష్‌బాబు విశాఖ కేంద్ర కారాగారానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విశాఖ కేంద్ర కారాగార అడిషనల్ సూపరింటెండెంట్ ఎం. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నెల్లూరు కేంద్ర కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్. సాయిప్రవీణ్ విశాఖ కేంద్ర కారాగారానికి బదిలీ అయ్యారు. నెల్లూరు కేంద్ర కారాగార ఆఫీస్ సూపరింటెండెంట్ వి.అప్పారావు విశాఖ కేంద్ర కారాగారానికి బదిలీ కాగా ఆయన స్థానంలో విశాఖ కేంద్ర కారాగార ఆఫీసు సూపరింటెండెంట్ డి. శరత్ బాబును నియమించారు.

మైనింగ్‌శాఖ డీడీ సరెండర్

నెల్లూరు (సెంట్రల్): జిల్లా మైనింగ్‌శాఖ డీడీ చంద్రశేఖర్‌ను కలెక్టర్ ఆనంద్ ప్రభుత్వానికి శనివారం సరెండర్ చేశారు. ఇటీవల ఎక్కువ సెలవులు పెడుతుండడంతో పాటు కార్యాలయంలో సమాచారం లేకుండా గుంటూరుకు వెళ్లిపోతుండడంతో ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల జరిగిన ఇసుక టెండర్ల సమయంలో కూడా సెలవు పెట్టి వెళ్లిపోవడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా కింది స్థాయి అధికారులకు, సిబ్బందికి, డీడీకి నడుమ కొంత కాలంగా కోల్డ్ వార్ నడుస్తోంది. దీంతో కింది స్థాయి అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. దీంతో కలెక్టర్ సీరియస్ అయి.. ప్రభుత్వానికి సరెండర్ చేశారు.



ఇందుకూరుపేట	ముత్తుకూరు	తోటపల్లిగూడూరు	అల్లూరు	మనుబోలు	విడవలూరు	నెల్లూరు రూరల్	కొడవలూరు	నెల్లూరు అర్బన్	కోవూరు	వెంకటాచలం	దగదర్తి
102.8 మి.మీ.	91.4	81.2	68.0	65.4	65.0	62.0	58.8	57.2	56.6	55.4	55.4

జిల్లాలో 34.1 మి.మీ సగటు వర్ష పాతం

నెల్లూరు(అర్బన్): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి 8 గంటల వరకు సగటున 34.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. తీరప్రాంత మండలాల్లో భారీ వర్షాలు నమోదవుతుండగా మెట్టప్రాంతాలైన ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు వంటి పడమటి మండలాల్లో పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. పొదలకూరులో 49.4, బుచ్చిరెడ్డిపాళెం 47.8, సైదాపురం 45.0, రాపూరు 44.4, బోగోలు 40.8, కావలి 28.6, సంగం 28.0, కలువాయి 27.4, చేజర్ల 23.4, ఆత్మకూరు 17.4, జలదంకి 16.2, ఉలవపాడు 16.2, అనుమసముద్రంపేట 13.4, గుడ్లూరు 13.2, కలిగిరి 12.2, కందుకూరు 12.2, అనంతసాగరం 10.6, కొండాపురం 7.0, లింగసముద్రం 6.2, వింజమూరు 5.0, మర్రిపాడు 3.8, ఉదయగిరి 3.2, దుత్తలూరు 3.0, వలేటివారిపాళెం 1.4, వరికుంటపాడులో 1.0 వర్షపాతం నమోదు కాగా సీతారామపురంలో చినుక జాడలేదు.





వాన పడగ

- వణికిస్తున్న ఫెంగల్
- జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా మోస్తరు నుంచి భారీ వర్షాలు
- శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు 34.1 మి.మీ.
- ఈదురుగాలులు, చలితో గజగజ
- తీరంలో సముద్రం అల్లకల్లోలం
- ముందుకు చొచ్చుకొచ్చి ఎగసి పడుతున్న అలలు
- రెడ్‌అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు

జిల్లాపై వాన పడగ వేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావానికి జిల్లా అంతటా వర్షం పడుతుండగా, వాతావరణ శాఖాధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం నుంచి సన్న చినుకులతో ప్రారంభమైన వర్షం.. రాత్రి సమయానికి మరింతగా పెరిగింది. శనివారం సాయంత్రం వరకు అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవగా, రాత్రి నుంచి ఈదురు గాలులు, వర్షసాంద్రత కూడా పెరిగింది. మరో వైపు సముద్రతీరం వెంబడి అలలు ముందుకు చొచ్చుకొచ్చి ఎగసి పడుతుంటే.. తీర గ్రామాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు.


నెల్లూరు (అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుఫాన్‌గా మారడంతో తమిళనాడు అంతటా వర్షం ముంచెత్తుతోంది. తమిళనాడుకు సమీపంగా ఉన్న నెల్లూరు జిల్లాపై తుఫాన్ ప్రభావంగా తీవ్రంగా ఉంది. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఎగసి పడుతున్నాయి. మైపాడు, రామతీర్థం, కొత్తకోడూరు, అల్లూరు ఇస్కపల్లి, బోగోలు తాటిచెట్లపాళెం, ఊటుకూరు పల్లెపాళెం తదితర ప్రాంతాల్లో సముద్రం 5 నుంచి ఆరు మీటర్లు ముందుకు చొచ్చుకొచ్చింది. దీంతో సమీప తీర గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లొద్దని, వేట సామగ్రిని భద్రపరుచుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణపట్నం పోర్టులో 3వ నంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వాతావరణశాఖ నెల్లూరు జిల్లాకు రెడ్‌అలెర్ట్ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ముసురు పట్టింది. వర్షానికి ఈదురు గాలులు తోడవడంతో ప్రజలు చలితో గజగజ వణుకుతున్నారు. ముసురు పట్టడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జనజీవనం స్తంభించింది. రోజువారీ కూలీలు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

నెల్లూరు నగరంలో లోతట్టు ప్రాంతాలైన టీచర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శివగిరికాలనీ, రాజీవ్‌గృహకల్ప కాలనీ, మనుమసిద్ధినగర్, జనార్దన్‌రెడ్డి కాలనీ, టైలర్స్‌కాలనీ, వైఎస్సార్‌నగర్, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. గాంధీబొమ్మ, సండేమార్కెట్, పొగతోటలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీతో కూడిన వర్షపు నీరు పొంగిపొర్లడంతో రోడ్లు జలమయమయ్యాయి. వాహన చోదకులు, పాదచారులు దుర్గంధ భరితమైన మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మరో రెండు రోజులు కొనసాగే అవకాశం

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు సూచించారు. ఇప్పటికే కురుస్తున్న వర్షాలతో పొలాల నిండా నీరు చేరి వేసిన నారుమళ్లు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ భాగం చెరువులు నిండి ఉండడంతో ఎక్కడ తెగిపోతాయోమోనని భయపడుతున్నారు.



బోగోలు మండలం తాటిచెట్లపాళెం వద్ద ముందుకు చొచ్చుకొచ్చిన సముద్ర తీరం

భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు సిద్ధం

- కలెక్టర్ ఓ ఆనంద్



నెల్లూరు రూరల్: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి భారీ వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం సోమశిలకు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో సమానంగానే ఉన్నాయని, భారీవర్షాలు కురుస్తున్నందున అన్నమయ్య జిల్లా నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితిని బట్టి నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

పెన్నాతీరంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పెన్నానది పరీవాహక ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆత్మకూరు, కావలి, నెల్లూరు ఆర్డీఓలు సోమశిల ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సోమశిల నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. సోమశిల ఎస్ఈ, ఈఈలు తమ సిబ్బందిని అందరిని అందుబాటులో ఉంచుకోవాలని, జలాశయంలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలి

ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోలు రూమ్‌లకు సమాచారం అందించాలని, మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు నెల్లూరు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు తుఫాను ప్రభావంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదని చెప్పారు. తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జేసీ కె.కార్తీక్, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సోమశిల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జి.కృష్ణకాంత్



నెల్లూరు (క్రైమ్): ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి. కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. అత్యవసర మందులు, నిత్యావసరాలు, పాల ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే డయల్ 112, పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 93929 03413కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తుఫాను తీరం దాటిన నేపథ్యంలో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. రెవెన్యూ, ఫైర్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పెన్నానది పరీవాహక ప్రాంతం, సముద్ర తీర ప్రాంతాలు, డ్యామ్‌లు, చెరువులు, వాగులు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): నగరంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తోడు, ఈదురు గాలులతో వెంకటేశ్వరపురం విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఎన్టీఆర్ గృహకల్ప విద్యుత్ ఫీడర్‌లో పలుచోట్ల వైర్లు తెగిపోయాయి. దీంతో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జోరు వానలో సైతం విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి, సరఫరాను పునరుద్ధరించారు.




విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

కొత్త రేషన్ కార్డులు వస్తాయ్

అర్హత కలిగిన పేదలకు కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయడానికి దరఖాస్తులను ఈనెల 2 నుంచి స్వీకరించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 28వ తేదీ వరకు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయొచ్చు. సంక్రాంతి నాటికి కొత్త కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల స్థానంలో కొత్త డిజైన్లతో కార్డుల్ని ముద్రించనున్నారు. అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు కీలకం కావడంతో లక్షలాది మంది కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. – కావలి

- రేపటి నుంచి 28వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ
- రేషన్‌కార్డు పొందడానికి అర్హతకు కొత్త నిబంధనలు
- గ్రామీణ, అర్బన్ వారీగా వార్షిక ఆదాయం, భూపరిమితి విధింపు



ఈ నెల 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈ నెల 2వ తేదీ నుంచి జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉండే ఉద్యోగుల ద్వారా ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు అందజేయాలి. జనవరిలో నూతన రేషన్ కార్డును అందజేస్తాం.

– డి.వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, నెల్లూరు

కార్డులు పొందడానికి కొత్త నిబంధనలు

- కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం విధి విధానాలను నిర్దేశించింది. కుటుంబాల ఆదాయ పరిమితిని బట్టి కార్డుల జారీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు రెండు రకాల ఆదాయ పరిమితుల బట్టి రేషన్ కార్డులు జారీ చేశారు.
- కొత్త రేషన్ కార్డులను ఇవ్వనున్న నేపథ్యంలో ఆదాయ పరిమితిని మార్చాలా, తగ్గించాలా పాత విధానాన్నే కొనసాగించాలా అనే విషయంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై పౌర సరఫరాలశాఖ విధివిధానాలను అధ్యయనం చేస్తోంది.
- రేషన్ కార్డును పౌర సరఫరాలశాఖ సరఫరా చేసే వస్తువులను తీసుకోవడానికే కాకుండా పలు సంక్షేమ పథకాల్లోనూ ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితి నిర్ధారణ విషయంలో కొత్తరేషన్, హెల్త్‌కార్డుల జారీపై ప్రభుత్వం పలు మార్పులను చేయాలని యోచిస్తోంది.
- ప్రస్తుతం గ్రామీణ, అర్బన్ ఏరియాల వారీగా వార్షికాదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్‌కార్డును ప్రభుత్వం జారీ చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, అర్బన్ రూ.2 లక్షల్లోపు వార్షిక ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. భూ విస్తీర్ణం మాగాణి భూమి అయితే 3.5 ఎకరాలు, మెట్ట భూమి అయితే 7.5 ఎకరాల్లోపు ఉండాలనే నిబంధనలు అమలు చేస్తున్నారు. తాజాగా ఇవే నిబంధనలు అమలు చేయడంతోపాటు పట్టణాల్లో భూమితో సంబంధం లేకుండా వార్షికాదాయన్ని మాత్రమే పరిగణనలో తీసుకోవాలని నిర్ణయించింది.



రేషన్ బండి నుంచి నిత్యావసర సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

- కొత్తరేషన్ కార్డులు మాత్రమే కాదు, ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసి ముద్రించి పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చనున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రిస్తారు.
- రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్తగా పెళ్లయిన వారికి కార్డులు జారీ చేయనున్నారు. ఇప్పటికే వారి కుటుంబానికి ఉన్న రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగించేందుకు స్ప్లిట్ ఆప్షన్‌ను కల్పించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివాహ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా కొత్త జంటకు రేషన్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారు, ఒంటరిగా ఉన్న వారికి రేషన్ కార్డులు ఇస్తారు. వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది. కొందరు కార్డుదారులు ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఈ కార్డులు తొలగిస్తే ప్రభుత్వానికి ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తుంది.
- ప్రభుత్వం వద్ద కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు సహా మార్పు చేర్పులు కోసం భారీగా దరఖాస్తులు రానున్నాయి. కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్, సభ్యుల యాడింగ్, తొలగింపు, అడ్రస్ మార్పు, సరెండర్ ఇలా పలు రకాల మార్పులతో భారీగా దరఖాస్తులు వస్తాయని, వీటిని నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని కసరత్తు చేస్తోంది.

పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

- పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): అభివృద్ధి కోసం పన్నుల వసూలు అవసరమనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యకలాపాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కమిషనర్ సూర్యతేజతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పన్నుల వసూల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టరాదన్నారు. 37 పార్కులకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక అమలులో ఉందన్నారు. విచ్చలవిడిగా తిరిగే ఆవులను యజమానులు తీసుకెళ్లాలని లేకపోతే ప్రభుత్వ మే ఇతర ప్రాంతాలకు తరలిస్తుందన్నారు. చెత్తను శుద్ధి చేసే వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ రాజమండ్రితోపాటు నెల్లూరుకు మంజూరైందని వెల్లడించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్‌కు చెందిన వివిధ విభాగాలధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను పారదోలుదాం

- జిల్లాలో తగ్గుముఖం పట్టిన కేసులు
- 2,773 మందికే పింఛన్లు
- మిగిలిన వారికి మొండిచేయి
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

మహమ్మారికి కళ్లెం



నెల్లూరు(అర్బన్): పొరపాటో.. గ్రహపాటో క్షణికానందంలో చేసే తప్పులకు అనేక మందికి హెచ్ఐవీ సోకి ఎయిడ్స్ బారిన పడుతున్నారు. పాతికేళ్ల క్రితం ఈ వ్యాధి సోకిన వ్యక్తిని అంటరాని వారిగా చూసేవారు. ఆ కుటుంబం బాధ వర్ణనాతీతంగా ఉండేది. ఈ స్థితిని పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి సంవత్సరం డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం.. నా హక్కు అనే థీమ్‌ను ప్రకటించింది. 2030 నాటికి ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని నినాదాన్నిచ్చింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

ఈ వ్యాధిని గతంలో ప్రాణాంతకంగా పరిగణించేవారు. ఏళ్ల తరబడి ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారు, కొత్త రోగులు కలిసి జిల్లాలో 13 వేల మంది ఉన్నారు. వీరిలో వైద్యశాఖ ద్వారా ఉచితంగా యాంటీ రిట్రోవైరల్ మందులు వాడుతున్న వారు 11,015 మంది ఉన్నారు. మిగిలిన వారు కార్పొరేట్ హాస్పిటల్స్, చెన్నైలాంటి నగరాల్లోకి వెళ్లి మందులు తెచ్చుకుని ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఎయిడ్స్‌ని నియంత్రించే ఏఆర్‌టీ మందులు అందుబాటులోకి రావడంతో వాటిని వినియోగిస్తూ ఎక్కువ కాలం జీవిస్తున్నారు.

వారిని ఆదరించాలి

ఎయిడ్స్ సోకిన వారిని మానవతా దృక్పథంతో ఆదరించాలని ప్రభుత్వం చెబుతోంది. ఒకరి దుస్తులు ఒకరు వేసుకున్నా, ఒకే స్విమ్మింగ్ పూల్, మరుగుదొడ్లను వినియోగించినా, కలిసి ఉద్యోగ విధులు నిర్వర్తించినా ఈ జబ్బు రాదు. కేవలం అనైతిక లైంగిక సంబంధాల వల్లే వస్తుంది. హెచ్ఐవీ నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖతోపాటు ఏడు స్వచ్ఛంద సంస్థలు కలిసి కృషి చేస్తున్నాయి. పది ఐసీటీసీ కేంద్రాలు, 58 పీహెచ్‌సీలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా ఆస్పత్రి, నగరంలో ఉన్న సర్వజన ఆస్పత్రి ద్వారా హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్నారు. నిర్ధారణ అయిన రోగుల వివరాలను గోప్యంగా ఉంచుతారు. వారు ప్రతి ఆరునెలలకు ఒక దఫా సీడీ-4 కౌంట్ పరీక్షలు చేయించుకుని అందుకనుగుణంగా మందులు వాడాలి.

తగ్గుముఖం

ఒకప్పుడు హెచ్ఐవీ సోకిన రోగుల్లో నెల్లూరు జిల్లా రెండో స్థానంలో ఉండేది. 2002 సంవత్సరంలో జిల్లాలో వ్యాధి తీవ్రత 17.8 శాతం ఉండగా 2024 నాటికి 0.6 శాతానికి తగ్గింది. అలాగే గర్భిణుల్లో 2002లో 2.7 శాతం ఉండగా ప్రస్తుతం 0.05 శాతానికి చేరుకుంది. ఎక్కువగా 15 ఏళ్ల నుంచి 49 ఏళ్లలోని వారు హెచ్ఐవీ బారిన పడుతున్నారు.

పింఛన్‌కు నోచుకోలేదు

ఎయిడ్స్‌కు గురైన వారు పౌష్టికాహారం తీసుకునేందుకు ప్రభుత్వం పింఛన్ అందిస్తుంది. అయితే ఎక్కువ మంది దీనికి నోచుకోలేదు. 11,015 మంది మందులు తీసుకుంటుండగా వారిలో కేవలం 2,773 మందికి మాత్రమే నెలకు రూ.4 వేలు చొప్పున పెన్షన్ అందుతోంది. మరో 5 వేల మంది దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు.

జిల్లాలో..

ప్రస్తుతం బాధితులు : **13,000**

మందులు తీసుకునే వారు : **11,015** మంది

రోగుల వివరాలు

సంవత్సరం	హెచ్ఐవీ పరీక్షలు	పాజిటివ్ వచ్చిన వారు
2017 - 18	78,566	1,301 మంది
2018 - 19	74,933	1,115
2019 - 20	73,637	965
2020 - 21	33,896	536
2021 - 22	83,735	662
2022 - 23	98,329	768
2023 - 24	1,21,946	751
2024 - 25 (అక్టోబర్ వరకు)	1,30,886	500

కృషి చేస్తున్నాం

జిల్లాలో ఎయిడ్స్‌ను నివారించేందుకు కృషి చేస్తున్నాం. కౌన్సెలింగ్ కేంద్రాల్లో యువతకు మంచి అలవాట్ల గురించి వివరిస్తున్నాం. నిండు జీవితం బుగ్గిపాలు కాకుండా ఉండాలంటే క్షణికానందం కోసం ప్రజలు తప్పుదారి పట్టకూడదు. ఎక్కువ మందితో లైంగిక సంబంధం తప్పు. వైద్యశాఖ, స్వచ్ఛంద సంస్థల సభ్యుల కృషితో ప్రజల్లో అవగాహన పెరిగింది. అందువల్ల క్రమంగా జిల్లాలో ఎయిడ్ తగ్గుతూ వచ్చింది.



– డాక్టర్ ఖాదర్‌వలీ, జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి

ముఖ్య నేతలతో కాకాణి భేటీ



నేతలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలతో శనివారం భేటీ అయ్యారు. నెల్లూరు డైకస్‌రోడ్డులోని కాకాణి క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నియోజవర్గాలకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట, కావలి, మాజీ ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ నేత మేకపాటి అభినవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు బృందాల ఏర్పాటు

నెల్లూరు(క్రైమ్): వర్షాల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, సిబ్బందితో ఆరు బృందాలను ఏర్పాటు చేశామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక పరికరాలు, వాహనాలు, బోట్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. బృందాలు బోట్లు, ఉడ్ కటింగ్, రెస్క్యూ విధులు నిర్వహిస్తాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈదురు గాలులకు స్తంభాలు, చెట్లు కూలిపోతే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందికి సెలవుల్ని రద్దు చేశామన్నారు. సెలవుల్లో ఉన్నవారు సైతం అగ్నిమాపక కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించామని తెలియజేశారు.

గాయపడిన వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): వాహనం ఢీకొందో? తనంతట తానే కిందపడ్డాడో? తెలియదు కానీ గుర్తుతెలియని వృద్ధుడు తీవ్ర గాయాలతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై నార్త్ ట్రాఫిక్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద గత నెల 23వ తేదీన గుర్తుతెలియని వృద్ధుడు (60) తీవ్రగాయాలై అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీనిని గమనించిన నగేష్ అనే వ్యక్తి 108 సాయంతో వృద్ధుడిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేశామని, మృతుడి వివరాలు తెలిసిన వారు నార్త్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

మాతా, శిశు మరణాలు బాధాకరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, చిత్రంలో అధికారులు

- నివారణకు కృషి చేయాలి
- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


నెల్లూరు(అర్బన్): 'మాతా, శిశు మరణాలు బాధాకరం. వాటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలి' అని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. నెల్లూరు సంతపేటలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో శనివారం మాతా శిశు మరణాల సబ్ కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అక్టోబర్ నెలలో రెండు మాతృ మరణాలు, ఆరు శిశు మరణాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఇందుకు సంబంధించిన కారణాలు, లోపాలపై చర్చించారు. గర్భం దాల్చిన ప్రతి స్త్రీని గుర్తించి వారి వివరాలను నమోదు చేయించి అప్పటి నుంచే ఏఎన్ఎంలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గర్భిణికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించాలన్నారు. బీపీ, రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి ప్రభుత్వాస్పత్రిలో సుఖ ప్రవసం అయ్యే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే పథకాల కింద లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. తల్లీబిడ్డలో ఎవరైనా రక్తహీనతతో, ఆరోగ్య సేవలు సకాలంలో అందక మరణిస్తే అందుకు ఆయా ప్రాంతాల ఏఎన్ఎంలను బాధ్యులను చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జీజీహెచ్ గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, ఎఫ్‌పీసీ పీఓ డాక్టర్ దయాకర్, జీజీహెచ్ చిన్నపిల్లల డాక్టర్ చిరంజీవి, డాక్టర్ సింధు, డెమో అధికారి కనకరత్నం, డీపీహెచ్ఎన్ఓ మంజుల, ఎస్ఓ సహన, ఏఎస్ఓ రమేష్, సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ఇంజినీర్లు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా రెండో యూనిట్లో 460 మెగావాట్లు, మూడో యూనిట్లో 700 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. బాయిలర్ పైపు లీక్ కావడంతో ఒకటో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 111
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 187

